
# గాజుపెంకులు

ఆదిమధ్యం రమణమ్మ



అద్దంలో తన అందాన్ని గర్వంగా చూసుకుంది రాజేశ్వరి.

తన అందం ఎక్కడా చెక్కు చెదరంలేదు! అయినా తన కెంత వయసని? పాతిక రాలేదింకా. అయినా ఎంత అనుభవమని? తన మనసులో మాయని గాయం అయితే ఏం? నలుపు, పోటు రాకుండా మందు రాసుకుంది. తన జీవితం అద్దంలా ముక్కలయింది.

అయితే ఏం ? అవన్నీ పోగేసి బంగారు భరిణలో భద్రంగా దాచుకుంది. తన అంద మైన అద్దం వంటి బ్రతుకుని ముక్కలు చేసినది ఒక బలమైన పిడికిలి. అయితే ఏమయింది ?

అప్రయత్నంగా రాజేశ్వరి పిడికిలి బిగిసింది. అంతలోనే సన్నని గులాబీ రేకులవంటి పెదవులు విచ్చుకున్నాయి. మల్లెమొగ్గల వంటి పలువరుస తళుక్కుమంది. అంతటితో ఆగలేదు–కిలకిలా నవ్వింది. ఆ నవ్వుకి అద్దం తెల్లబోయి చూసింది! అద్దంమీద వాలిన పిచ్చుక బెదిరి పారిపోయింది.

అవును ఏమిటయింది? అర్థం లేని విలువల కోసం బ్రతుకెందుకు బలి చేసుకోవాలి? బ్రతుకులో విలువలు సాధించాలి గాని? పగ-పగ—తనది రాచపుట్టుక. పగ సాధించాలి సాధించిందా?

వాడు కబురుపెట్టాడు. ఇన్నాళ్ళకి మళ్ళీ ఆ ఊరెడుతోంది. తనకేం భయం?

మైసూరెడ్ల పెట్టె బండి ఎక్కింది. ఎంతో హుషారుగా ఎద్దులు పరుగు తీస్తున్నాయి? ఎద్దులు బాగా బలిసి వున్నాయి. పశువులు బలిస్తే బాగా పనిచేస్తాయి. మరి మనిషి? కష్టజీవి బలిస్తే కష్టం చేస్తాడు. కాని-కాని డబ్బు బలిసిన మనుషులో-

ఆకాశంలో మబ్బులు కమ్ముకొస్తున్నాయి. ఊరు దగ్గరపడుతున్నకొద్దీ హుషారుగా ఉన్న మనసెందుకో ఉదాసీనంగా మారిపోయింది.

"అమ్మగారూ వర్షం వచ్చేలా వుంది. ఆ కాపడుతున్న తోటలోకి బండి తోలమంటారా?" బండివాడు అడిగాడు.

"నీ ఇష్టం" అంది నిర్లిప్తంగా.

బండి తోటవైపు సాగిపోయింది.

మబ్బులు చిక్కబడిలోకాన్ని చీకటిఆవరించింది. కళ్ళు మిరుమిట్లు గొలిపే మెరుపులు, గుండెల్ని బ్రద్దలు చేసే ఉరుములు. బండి ఆగింది. బండి దిగి తోటను పరిశీలిస్తోంది రాజేశ్వరి. గాలి వేగానికి చెట్లు పిచ్చిగా ఊగుతున్నాయి.

నడుచుకుంటూ వెళ్ళి తోటమధ్య ఉన్న బంగళా వసారా ఎక్కింది. చేతిలో ఉన్న లాంతరుకు చేయి అడ్డుపెట్టి సీతాలు లోపలి నుంచి ఇవతలికి వస్తూ "ఎవరమ్మా మీరు?" అన్నది.

ఆమెను చూసి గతుక్కుమంది రాజేశ్వరి. ఆమె వెనుకే లోపలికి వచ్చి కుక్కిమంచం మీద కూలబడింది.

"మీరా రాజేశ్వరమ్మగోరూ" అంది సీతాలు ఆశ్చర్యంతో నోరు వెళ్ళబెట్టి.

ముఖం దించుకుంది రాజేశ్వరి.

తానెక్కడికి వచ్చింది? తలెత్తి ఒకసారి నాలుగు వైపులా చూసింది. తిరిగి తల దించుకుంది. వెన్ను నిలబెట్టి ఇంక కూర్చోలేనట్లు గోడకి చేరగిలబడి కళ్ళు మూసుకుంది.

కొంతసేపు వింతగా ఆమె కేసి చూసి కాసిన్ని టీ నీళ్ళు పడేద్దామని వసారా గదిలో కెళ్ళింది సీతాలు.

కళ్ళు మిరుమిట్లు గొలిపే మెరుపులు. గుండెలు బ్రద్దలుచేసే ఉరుములు. తన లోనా? పైనా? సంతతధారగా కారుతున్న కన్నీరు. తన ఎదని ఏ తలపులు ఈ భీభత్సాన్ని సృష్టిస్తున్నాయి!

తనూ, తండ్రీ, చెల్లెలూ, తమ్ముడూ కలిసి కాపురమున్న కొంప ఇది. తన తండ్రి ఈ తోటకి, చాకిరీ చేసేవాడు. కాదు కాపలా కాసేవాడు. అతనికున్న నీతినీ, నిజాయితీని, విగ్రహ పుష్టినీ చూసి నాయుడు తన తండ్రి కాపదవి ఇచ్చాడు. తన తండ్రి పేదవాడై ఉండి పట్టపు రాజులా సంతోషించాడు. ఠీవి, దర్పంతో తోటంతా తనదే అయినట్లు అదే తన చిన్న రాజ్యమైనట్లు రాజసం ఉట్టిపడేలా తిరిగేవాడు.

తోటమాలిగా మావుళ్ళయ్య. సీతాలు పిల్లలతో మరోమూల గుడిసెలో కాపురముండేవారు.


తనతల్లి పురిటిసంబంధమైన జబ్బుతో మరణించింది. తనకి చిన్నతనంలోనే పెళ్ళి చేశారు. కాపురానికి వెళ్ళకుండానే విధవ అయింది. తల్లి పోయాక తను జాగ్రత్తగా తమ్ముణ్ణీ, చెల్లెల్నీ సాకుతూ తండ్రికీ, వాళ్ళకి లోటు రాకుండా సేవలు చేసేది.


గులాబిరంగు చెక్కిళ్ళు, మెరిసే కళ్ళు, నల్లని కురులు, నూతన యౌవనంతో మిడిసిపడే తనను చూసి తండ్రి నిట్టూర్చేవాడు. అపుడపుడు మనసులో తియ్యని తలపులు రేగేవి. అందుకు కారణం రంగరాజు. అతను తమ కులం వాడే. అతనూ పేదవాడే. బట్టలుకుట్టి బ్రతికేవాడు. అపుడపుడు తోటకి వచ్చి ముచ్చట్లాడి వెళ్ళేవాడు. మురిపెంగా చూసేవాడు. కళ్ళు, మనసు మూగగా మాట్లాడుకొనేవి. కాని, పెదవులు మాత్రం ఒక్కసారైనా మనసును మాటల్లోకి రానీయలేదు.

తమకి నాయుడుగారు సంవత్సరానికింత అని ధాన్యమే కొలిచేవారు. ఒకొక్క జత బట్టలు ఇచ్చేవారు. అవికాక పెళ్ళిళ్ళకీ, పెద్ద పండక్కి వేరే ఇచ్చేవారు. స్వల్పంగా జీతం ఇచ్చేవారు. అది చాలక పోతే తిండి ధాన్యమే అమ్ముకొనేవారు. తమ్ముడు, చెల్లెలు స్కూలుకు వెళ్ళి చదువుకొనేవారు. తను విధవ కాబట్టి ఇంట్లోనే వుండిపోయేది. వారికి చదువు చెబుతూ వారి ద్వారానే తనూ పుస్తకాలు చదివేది.

ఇలా సంసారం ఒడిదుడుకులతోనే అయినా చల్లగా సాగుతుండగా తండ్రి దురదృష్టవశాత్తు పాముకాటు తిని మరణించాడు. తాను హడలిపోయింది. ఈ చిన్నపిల్లలతో తానేం చేయాలో, ఎలా బ్రతకాలో తెలియలేదు. చివరికి మంచో, చెడ్డో మేనమామ ఇంటికి వెళ్ళిపోవడానికే నిశ్చయించుకుంది. దూరాభారం, చార్జీలకు చాలా డబ్బు కావాలి.

ఓ రాత్రి టైములో నాయుడుగారింటికి వెళ్ళి, నాయుడుగారి భార్య ద్వారా తమకి






సొమ్ము ఏదైనా ఇప్పించమని అడిగింది.

దానికి నాయుడుగారు నవ్వుతూ "ఊరి నుంచి వెళ్ళిపోవడ మెందుకూ? ఆ తోట లోనే వుండమను.వారిపోషణ నేచూస్తాగా" అన్నాడు.

తను ఇంటికి వచ్చేసింది.

మరోసారి కరణంగారింటికీ వెళ్ళి అర్థించింది. ఎలా అయినా వెళ్ళిపోవాలి. తనా ఊరులో ఇంక బ్రతకలేదు."అలాగే నమ్మా దానికేముందీ. తొందరపడకు" అన్నారు తలుపుచాటునున్న తన అందాన్ని ఎగాదిగా చూస్తూ-

నిరాశతో ఇంటికి వచ్చేసింది.

ఆ తరువాత వాళ్ళ అంతర్యాలు బోధ పడ్డాయి.అందరూ తలో కాగితం పంపారు. తమకు రహస్యంగా వినియోగపడమనీ, ఏ లోటూ రాకుండా చూస్తామనీ, గుట్టు చప్పుడు కాకుండా వ్యవహారం సాగిస్తామనీ. అసహ్యంతో జుగుప్సతో మనసు కుతకుత ఉడికిపోవడమే కాదు భయంతో కంపించిపోయింది. 'తండ్రి వయసువారు ఎంతకి తెగించారు?' అని విస్తుపోయింది.

ఇది జరిగాక మరింత తొందరగా ఆ ఊరు నుంచి పోవాలని ప్రయత్నించింది. తెలిసిన వారినందరినీ డబ్బు అడిగింది. ఎవరిస్తారు ఉచితంగా అంత డబ్బు? మేనమామకి వ్రాద్దామన్నా అంత డబ్బు ఎత్తిపెట్టి పంపే పరిస్థితి కాదు. తాము వస్తామంటేనే మేనత్త ముందు అడ్డుపెట్ట వచ్చు. ఏదోవిధంగా అక్కడికి చేరిపోతే. మేనమామే చూసుకుంటాడు. అమ్మడానికి ధాన్యమూ లేదు. "ఎందుకమ్మా వెళ్ళి పోవడం?ఇన్నాళ్ళు చూసిన నాయుడుగారే ఏదో చూస్తారు" అన్నారు.

ఆయన సంగతి నోరు విప్పి ఎలాగ చెప్పడం? చెబితే మాత్రం ఎవరు నమ్మ తారు.

ప్రతీ క్షణం భయంతో గడుపుతూం డగా ఆ భయంకర క్షణం రానే వచ్చింది.

ఓ రోజు రాత్రి చిన్న కునుకుపట్టిందో లేదో, నాయుడుగారబ్బాయి నాగేషూ, కరణంగారబ్బాయి శేషూ, ఇద్దరూ వచ్చి తలుపు తట్టారు.

తలుపు తీసిన తను విభ్రాంతపోయి నించుండిపోతే తనని లోపలికి లాక్కు వచ్చారు.

తను కెవ్వుమని అరిచింది. ఆ అరు పుకు చెల్లెలు లేచి ఆ చీకట్లో బైటికి పారి పోయింది. తమ్ముడు వంట ఇంట్లోకి పారి పోయాడు. అది వారు అంతగా గమనించ లేదు. తన నోరు నొక్కి మంచంమీదకు తోసి తలుపు గడియపెట్టారు. తనను వదిలి పెట్టమని ఎంతో ప్రార్థించింది. ఏడ్చింది. విదిలించి కొట్టింది. పెనుగులాడింది, ఎన్నో చేసింది. కాని ఇద్దరు. వంట ఇంట్లోంచి పీటలు, అప్పడాల కర్రలు, విసురుగా వారిమీదకు వచ్చి పడుతుంటే కరణంగారి శేషు వెళ్ళి తమ్ముణ్ని లాక్కు వచ్చాడు. తమ్ముడు ఎంతో రోషంగా రౌద్రంగా వున్నాడు "వదలండి మా అక్కని. వదలకపోతే చంపేస్తాను" అని అరిచాడు. గుప్పెళ్ళు బిగించాడు. గూట్లో వున్న పుస్తకం అందుకుని నాగేష్‌మీదకు విసిరాడు."ఒరిపిడుగా! పట్టుకోరా వాణ్ని" అని నాగేష్ వాణ్ని ఎడాపెడా తన్ని వరండా లోకి నెట్టి తలుపు వేశాడు.

లోపల తను, బైట తమ్ముడు.

ఇద్దరి అరుపులు, ఆర్తీ ఏ దేముడికీ వినిపించలేదు.ఏ మానవుడూ అటు రాలేదు. తమ్ముడు చాలా సేపు తలుపులు దబదబా బాదాడు. కాని-కాని తరువాత తలుపు చప్పుడు ఆగిపోయింది. తన తనువు స్పృహ కోల్పోయింది.

ఆ రోజూ ఇలాగే భీభత్స వర్షరాత్రి.

తెల్లవారి లేచి చూస్తే ఏముంది?

ఇంట్లో యుద్ధ భీభత్సం. శరీరంమీద గాయాలు, లేవలేని నిస్సత్తువ, భరించలేని అవమానం-గోలున రెండు చేతులూ కప్పు కుని ఏడుస్తుంటే, చటుక్కున తమ్ముడు, చెల్లెలు గుర్తుకు వచ్చారు. అధాటుగా లేచి తోటలోకి పరుగెత్తింది. నాలుగు వైపులా చూసింది. ఎందుకో అనుమానం వచ్చి నూతిలోకి చూస్తే ఏముంది? తమ్ముడి శవం.

"తమ్ముడూ" దిక్కులు పిక్కటిల్లేలా అరిచింది, గుండెలు బాదుకుంది, తల మోదుకుంది.

సీతాలూ, మావుళ్ళయ్యా వచ్చారు. తమ్ముణ్ని పైకి తీశారు. తమ్ముడి శవం మీద పడి ఏడ్చింది, మొత్తుకుంది.

"ఏం జరిగిందమ్మా?" అని వారు అడిగారు.

ఏమని చెబుతుంది, ఏడవడం తప్ప.

తమ్ముని ముఖంలోకి గుచ్చిగుచ్చి చూసింది.

వాళ్ళు పడవేశారా? వాడే పడ్డాడా?

పౌరుషంతో వాడే పడి వుంటాడని బిగించిన వాడి పిడికిళ్ళు, గుప్పెళ్ళు చెబు తున్నాయి. రాత్రి వాడి పోరాటం కళ్ళకి కట్టింది. తన అక్కని కాపాడాలని వాడు ఎంత తాపత్రయపడ్డాడు? కాపాడలేని తను ప్రాణత్యాగం చేశాడు. మరి తను? "కాపాడవలసినది నేనురా తండ్రీ నేనూ చస్తానురా" అని వాడి కేసి ఏడుస్తూ చూసింది.

'వద్దక్కా చావొద్దు. పగ, పగ, పగ తీర్చుకో' అని చెబుతున్నట్లు వుంది వాడి

ముఖం. తన సర్వస్వం పోయింది. తను ఎందుకింకా జీవించడం? కాదు జీవించాలి ప్రతీకారం తీర్చుకోవాలి. వాళ్ళకి, వాళ్ళకి బుద్ధి చెప్పాలి. ఎలా ఎలా? ఎలాగోలాగ.

మూడు రాత్రులు, మూడు పగళ్ళు ఏడుస్తూ గడిపింది. దిక్కులేనివారి చావుకు ప్రాముఖ్యమేముంది?

అక్కమీద కోపం వచ్చి చచ్చాడను కున్నారు. కరణానికీ, మునసబుకీ సూచాయగా తెలిసినా, ఏమీ తెలియనట్లు వేరే కార్యకలాపాల్లో మునిగిపోయారు. తమ కంటె తమ పిల్లలు ముందడుగు వేసి నందుకు, మనసులోనే విసుక్కుంటూ జరిగిన సంఘటనను రబ్బరుతో పెన్సిల్ రాత చెరిపినట్లు చెరిపేశారు.

కాని తన మనసులో-జీవితంలో చెరిగి పోదే-రంగరాజు వచ్చి పరామర్శించాడు. ఓదార్చాడు. "ఒంటరిగా ఏం వుంటావ్ నాతో వుందువుగాని రా" అని పిలిచాడు.

తను మైలబడింది. అతనితో ఎలా వెడుతుంది? తనకి మైల అంది- అయినా ఆ పరిస్థితిలో తనకేం మనసుకు పట్టలేదు. పగ-పగ-కసి-కసి. ఇవే ప్రతిధ్వనిస్తు న్నాయి మనసులో.

నాలుగోనాడు స్నానం చేసింది. మావుళ్ళయ్యని పిలిచింది. తమ్ముని తెల్ల కాగితాల పుస్తకంలోని కాగితాలు చింపింది. వ్రాసినదే వ్రాసింది. చింపినదే చింపింది. మళ్ళీ వ్రాసింది. మునసబు నాయుడి కొడుక్కిచ్చి రమ్మంది.

నాగేషు మురిసిపోయాడు. ముచ్చట వడ్డాడు. రాజీ. రాజీపడింది. రాజేశ్వరిగా మారిపోయింది. "ఊళ్ళో ఉంటే మీ తండ్రులు పోటీవస్తారు. పట్నంలో మకాం. ఆ పై ఇంద్రభోగం కావా"లంది. "ఓ యస్" అన్నాడు.

రాజు తలుచుకుంటే దెబ్బలకి కొదువా?

వదహారేళ్ళు నిండిన రాజేశ్వరికి పట్నంలో కాపురం. పట్నంలో రాజేశ్వరి పని మూడు పూవులూ, ఆరు కాయలుగా ఉంది. కొన్నాళ్ళు నాగేషు ఊళ్లో ఉండే వస్తూపోతూ వుండేవాడు. ఆ తరువాత కాలేజీ చదువని పట్నంలోనే మకాం.

చదువు వంక నాగేషుది. అతను కాలేజీకి పోయాక అవీ ఇవీ చదివేది రాజేశ్వరి.

మరో గది కూడా వేరే తీసుకున్నాడు- బుద్ధిమంతుడులా కనపడ్డానికి. తండ్రి రాక పోకల్లో తాను బుద్ధిగా చదువుకుంటు న్నట్లు కనబడాలి మరి.

పరీక్షలమీద పరీక్షలనీ, లంచాలనీ, వ్యాపారమనీ ఆస్థంతా అప్పులమయం చేశాడు.

చాలా కాలానిగ్గాని నాయుడికి అసలు సంగతి తెలిసిరాలేదు. వ్యవహారం అంత గుట్టుగా జరిగింది. తెలిశాక తనకి కబురు పెట్టాడు. చాలా దీనస్థితిలో- కబురుపెట్టి ఏం చేస్తాడిప్పుడు?

జరిగినదంతా తలపులలో కొచ్చి మన సును కలచివేయగా, చివర్న ఓ చిరునవ్వు నవ్వుకుని ఏ తెల్లవారు జామునో నిద్రా దేవి ఒడిలోకి ఒరిగింది రాజేశ్వరి. సీతాలు ఇచ్చిన టీ మాత్రమే తాగింది. మరేమీ ఒద్దంది. ఆ మంచంమీద అలాగే ఒరిగి పోయింది.

తెల్లవారి పొద్దెక్కి లేచింది. రంగ రాజుకు కబురెట్టింది. లేడట. వచ్చాక కబురు చెబుతామని చెప్పారు. స్నానం, భోజనం, నిద్ర అన్నీ కానిచ్చే తాపీగా నాయుడింటికి బయలుదేరింది.

నీరసంగా, ఒంటికాలితో, కొన ప్రాణంతో మంచాన్ని అంటిపెట్టుకున్న నాయుణ్ణి చూసి కళ్ళు మెరిశాయి. మనసు జాలిపడింది.

కాలిలో అద్దం పెంకు గుచ్చుకుని సెల వేసి షుగర్ కంప్లయింట్‌వల్ల కాలు కొంత భాగం తీసేయవలసి రావడం, పట్నంలో చాలా రోజులు హాస్పిటల్లో వుండటం అన్నీ రాజేశ్వరికి తెలుసు.

ఆలోచనలు కట్టిపెట్టి కుర్చీలో కూర్చుంటూ రాణి మంత్రిని అడిగినట్లు, "ఎందుకు పిలిపించారు?" అని అడిగింది.

రాజేశ్వరిని అంత నీరసంలోనూ నిలు వెల్లా దహించేసేటట్లు చూశాడు. చూసి నిట్టూర్చాడు.

ఆమె పరిస్థితిని తన పరిస్థితిని సరి పోల్చుకుని.

బలవంతాన్ని మనసుకు మాటకు శాంతం తెచ్చుకోడానికి క్షణం మాట్లాడ లేక అలాగే చూస్తూ వుండిపోయాడు.

ఆ తరువాత గొంతు సవరించుకుని-

"నువ్వు ఎటో పారిపోయావను కున్నాను. కానీ పట్నంలో ఉండే ఇలా జలగలా నా బిడ్డనీ, నా సంసారాన్నీ, నా ఆస్తినీ పీలుస్తున్నావని తెలియలేదు. తెలుసు కోలేకపోయాను. వాడు నిజంగానే గొప్ప చదువులు చదువుతున్నాడను కున్నాను. ఆస్థి అంతా అప్పుల పాలైంది. వాడు పెళ్ళికి ఒప్పుకొంటె లక్షల కట్నం వస్తుంది. నా ఆస్థి అందరికీ తెలుసుగాని నా అప్పులు అందరికీ తెలియవు. వాడి కట్నం డబ్బుతో అప్పులు తీర్చి, కోడలికి కొంత పొలం రాస్తాను. వాడు పెళ్ళికి ఒప్పుకోవడం లేదు. నేనెంతో కాలం బ్రతకను. బిడ్డ లాంటి దానవు. మీ నాన్న, మీ తమ్ముడు పోతే ఆదుకుందామనే అను



కున్నాను. ఎటో పారిపోయావు. వాణ్ని వదులు- పెళ్ళికి ఒప్పించు. నీకు—నీకు-" ఆయాసంతో మరి మాట్లాడలేక పోయాడు.

రోషావేశాలతో ఏం మాట్లాడాలో బోధపడ్డం లేదు రాజేశ్వరికి. ముక్కుపుటాలు అదురుతున్నాయి. గుండెలో ఎన్నో ధ్వనులు గగ్గోలు పెడుతున్నాయి. పెదవులు మొరాయిస్తున్నాయి. పళ్ళు గిట్ట కరుస్తున్నాయి. ఆవేశాన్ని అణుచుకుంటూ అంది:

"నేను ఒకప్పుడు మీ బిడ్డలాంటదాన్నినే అన్నాను. నన్ను వదిలివేయమనే అన్నాను. మీరే వదల్లేదు. మీ అబ్బాయి వదలనంటే నేనేం చెయ్యను?"

"ఎప్పటి మాటో ఇప్పుడెందుకు! ఇప్పటి మా దీనస్థితి చూడు. ఒకప్పుడు మీ కుటుంబాన్ని పెట్టి పోషించాను. అది గుర్తుతెచ్చుకో. మా అబ్బాయి వదలనన్నా నువ్వే వదిలి ఎక్కడికైనా వెళ్ళిపోవచ్చు. కావాలంటే డబ్బు—" ఆగిపోయాడు.

"డబ్బు ఇప్పుడు నా దగ్గర చాలా ఉంది. సంపాదించాను. మీ అబ్బాయిని వదిలి వెళ్ళబుద్ధి కావడం లేదు. అతను వదిలేస్తానంటే నా అభ్యంతరం లేదు."

"వాడు నిన్ను వదలడు. అందుకే నిన్ను కబురు పెట్టాను. నువ్వే వాణ్ని వదిలిపోవాలి".

"పోకపోతే?"

"జరిగేదానికి నేను బాధ్యుణ్ని కాదు. నా కుటుంబాన్ని ఎలా రక్షించుకోవాలో నాకు తెలుసు."

"సరే" అని రోషంతో లేచి నుంచుంది క్షణం.

తీవ్రంగా అతణ్ని చూస్తూ "సెలవ్" అని చరచరా బైటకి వెళ్ళిపోయింది.

ఆమె చూపులు నిలువునా కాల్చేస్తున్నట్లుగా అనిపించాయి నాయుడికి. బ్రతికుండగానే తనమీద పుల్లలు పేర్చి చితి అంటించేస్తున్నట్లు అనుభూతి పొందాడు.

ఆవేశంలో- ఆయాసంతో అపజయంతో అతని గుండె లయ తప్పింది. అద్దంలాంటి ఆమె బ్రతుకును బద్దలు చేశాడు. ఫలితం అనుభవిస్తున్నాడు. బ్రతుకుపై, ప్రాణాల్ని కాపాడుకోవాలని చివరి ప్రయత్నం చేస్తున్నాడు.

ఆమె దయ తనపై లేదా- తన నిర్దయ ఆమెపై- రెండింటిలో ఏదో ఒకటి జరగాలి-

నాయుడు ఆశించినట్లు రెండూ జరగలేదు!

చీకటిలో చరచరా తోటలోకి త్రాచుపాములా బుసలు కొడుతూ పోతున్న రాజేశ్వరిని దారిలో ఊరిబైట రంగరాజు అడ్డగించాడు. రాజీని పోల్చాడు. "రాజీ తొందరగా సైకిలెక్కు- అర్జెంటు- ఆలశ్యం చేయకు" అని చేయిపట్టిలాగి సైకిల్ మీద కూర్చో బెట్టాడు. రయ్యమని గాలితో పందెంవేసి చీకట్లో మాయమయ్యాడు.

రాజీ రాగానే తోటలో అడుగు పెట్టగానే కర్రలతో నేల కరిపిద్దామని కాసుకున్న మనుషులకు నిరాశే మిగిలింది.

గుండె నొప్పివచ్చి కడసారి కన్నకొడుకుని చూద్దామన్న ఆశైనా తీరకుండా కళ్ళుమూశాడు మంచాన్నిపట్టిన నాయుడు.

ఎప్పుడు చస్తాడా ఆస్థి అప్పులకి జమ చేసుకుందామా అని అప్పుల వాళ్ళు కాసుకు కూర్చున్నారు.

తండ్రి చావు కబురు తెలిసి పట్నం నుంచి హడావిడిగా వచ్చాడు నాగేషు.

'తన కొడుకుని వదిలేయమన్నాడు నాయుడు. రంగరాజు ఎటో తీసుకుపోతున్నాడు ఇదీ బాగానే ఉంది' అనుకుంది రాజేశ్వరి.

"తెలిసిందంటే నాయుడు చంపించేస్తాడు. అది తెలిసిపోయిందిగనుక రాజీని ఎటో దూరతీరాలకు తీసుకుపోవాలి' అనుకున్నాడు రంగరాజు.

ఒకరి సంగతి ఒకరికి తెలియకుండా జరగవలసిన సంఘటన జరిగిపోయింది.

